29న రాష్ట్ర స్థాయి యోగా పోటీలు

కలెక్టరేట్ : రాష్ట్ర స్థాయి యోగా పోటీలను రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహిస్తుందని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపి క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, రాష్ట్ర స్థాయి శాప్ యోగా లీగ్ (ఫేస్-11) క్రీడా పోటీలను నిర్వహిస్తుందని పేర్కొన్నారు. 8 నుంచి 14 ఏళ్లలోపు బాలబాలికలకు ఈనెల 27న తిరుపతి ఎస్-ఎస్ఎస్ కాంప్లెక్స్ లోనూ, 14 నుండి 21ఏళ్లలోపు బాలబాలికలకు ఈ నెల 29న కాకినాడ డిఎస్ఎ స్టేడియంలో నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. వీటిలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు రూ.200 ప్రవేశ రుసుము చెల్లించి తమ ఆధార్ కార్డు, వయస్సు ధ్రువీకరణ పత్రాలతో పేర్లను నమోదు చేసుకోవాలని వివరించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు యోగా శిక్షకులు జి.వెంకటేశ్వర రావు (సెల్ నెం 7842829449)ను సంప్రదించాలని ఆ ప్రకటనలో తెలిపారు.

జంబ్లింగ్ పద్ధతితో తిప్పలు

- ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు
- కొనసాగుతున్న మిల్లర్ల దోపిడీ

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాదీ ధాన్యం కొనుగోలు కేంద్రాలతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆరుగాలం కష్టపడి చేతికొచ్చిన పంటకు సరైన గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులకు రాకపోవడంతో నిరాశ చెందుతున్నారు. మిల్లర్లతో సంబంధం లేకుండా ఆర్‌బికె కేంద్రాల ద్వారానే కొనుగోలు చేస్తామని, వాహనాలు ఏర్పాటు చేస్తామని, గోనె సంచులు అందిస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ వాస్తవంగా రైతులకు ఎటువంటి సౌకర్యాలు కల్పించలేకపోతున్నారు. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. పండగ ముందు ధాన్యం విక్రయించి డబ్బులు సంపాదించుకోవాలని రైతులు భావిస్తున్నప్పటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సక్రమంగా కొనుగోలు చేయకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలో 17వేల ఎకరాల్లో వరి సాగవుతుంది. అయితే ఇ-క్రాప్ చేసిన పంటకు మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికి 85శాతం మాత్రమే ఇ-క్రాప్ జరిగింది. మిగిలిన 15శాతం మంది రైతులు ధాన్యం ఎవరికి ధాన్యం విక్రయించాలో తెలియక ఆందోళన చెందుతున్నారు.

జంబ్లింగ్‌తో తప్పని తిప్పలు

రైతులకు ఈ ఏడాది జంబ్లింగ్‌తో తిప్పలు తప్పడం లేదు. ఈ మండలం రైతులకు వేరే ప్రాంతాల్లో మిల్లర్లకు జంబ్లింగ్ పేరుతో అప్పగించడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాలకొండ మండల రైతులు ఇక్కడి మిల్లర్లకు ధాన్యం విక్రయిస్తే వాహన ఖర్చులు తగ్గుతాయని భావిస్తున్నారు. ఈ ప్రాంత రైతులు పార్వతీపురం, గుమలక్ష్మీపురం, కురుపాం ప్రాంతాల మిల్లర్లకు విక్రయించాల్సిన పరిస్థితి రావడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఏ-గ్రేడ్ రకం క్వింటకు రూ.2065, సాధారణ రకం క్వింటకు రూ.2040 ప్రకటించింది. అయితే సాధారణ రకం 80 కేజీలు బస్తాలు రూ.1630 కాగా, గోనె సంచులు బహిరంగ మార్కెట్లో రైతులు కొనుగోలు చేస్తున్న పరిస్థితి దాపురిస్తుంది. రూ.12కు ఒక్కొక్క గోనె సంచి ధర పలుకుతుండగా ప్రభుత్వం మాత్రం రూ.3.90 పైసలు మాత్రమే కేటాయించింది. అదే విధంగా వాహనాల రవాణా చార్జీ కూడా అంతంత మాత్రంగానే ఇవ్వగా ప్రైవేట్ వాహనదారులు రైతుల వద్ద భారీగా వసూలు చేస్తున్నారు.

పార్వతీపురంలోని మిల్లులకు తరలిస్తున్న ధాన్యం

మిల్లర్ల దోపిడీ

ధాన్యం కొనుగోలులో మిల్లర్ల దోపిడీకి అడ్డూఅదుపు లేకుండా పోతుంది. ఆ స్థాయి అధికారులు హెచ్చరిస్తున్నా మిల్లర్ల ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతుంది. పేరుకే ఆర్‌బికె కేంద్రాల్లో పంట నాణ్యతను పరిశీలిస్తున్నప్పటికీ మిల్లర్లు మళ్లీ అక్కడ పరిశీలించిన తరువాతే ధాన్యం తీసుకుంటున్నారు. లేదంటే వాహనాల నుంచి ఒక్క బస్తా కూడా కిందికి దించడం లేదు. ఇదే కాకుండా 80 కేజీల బస్తాకు 4 కేజీలు ధాన్యం ఇస్తే తప్ప కొనుగోలు చేయమని పట్టుబడుతున్నారు. చేసేదేమి లేక రైతులు లబోదిబోమంటున్నారు.

ఎంఇఒపై చర్యలు తీసుకోవాలని ధర్నా

- కలెక్టర్‌కు యుటిఎఫ్ నాయకుల వినతి
- ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల ఆందోళన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్థానిక మండల విద్యాశాఖ అధికారి పివి ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం వినతి అందించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు మాట్లాడుతూ ఎంఇఒ చాలా కాలం నుండి ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని, ఉపాధ్యాయులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పని సర్దుబాటులో అక్రమాలకు పాల్పడ్డారని, అనవసరంగా కొంతమంది ఉపాధ్యాయుల జీతాలను నిలిపి వేశారని అన్నారు. సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయులు, నాయకులు అడిగితే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. చిన్నచిన్న కారణాలతో జీతాలు నిలుపుదల చేస్తున్నారన్నారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ చర్యలు లేవని, ఇప్పటికైనా ఆయనపై చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో పలు మండలాలకు చెందిన ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

కలెక్టర్‌కు వినతి

కలెక్టరేట్ : ఎంఇఒ పివి ప్రసాద్ చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సోమవారం కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఎంఇఒ అలసత్వం ప్రదర్శిస్తున్నారని, కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు. పనిసర్దుబాటులో అక్రమాలు చేశారని, ఉపాధ్యాయులను మీరు ఏ సంఘంలో ఉన్నారని యుటిఎఫ్‌లో ఉండొద్దని బెదిరిస్తున్నారని కలెక్టర్‌కు విన్నవించారు. ఉపాధ్యాయులకు ఎర్నడ్ లీవ్, అరియర్ బిల్లులు తదితరమైనవి మంజూరు చేయడం లేదన్నారు. బదిలీలను అక్రమంగా నిలిపివేశారన్నారు. వీటన్నింటిపై సమగ్రంగా దర్యాప్తు చేసి ఎంఇఒపై చర్యలు తీసుకోవాలని కలెక్టరును కోరారు.

స్పందించిన జెసి

యుటిఎఫ్ నాయకులు ఎంఇఒపై ఇచ్చిన ఫిర్యాదుపై జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ స్పందించారు. ఎంఇఒకు షోకాజ్ ఇవ్వాలని డిఇఒను ఆదేశించారు. అప్పటికీ చూడకపోతే చర్యలు ఉంటాయని జాయింట్ కలెక్టర్ చెప్పారు.



తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న రైతుసంఘం నాయకులు, రైతులు

ధాన్యం కొనుగోలు సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలో ధాన్యం కొనుగోలులో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ, రైతు కూలి సంఘం నాయకులు మామిడి సింహాద్రి నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు మండల పెదపాపినాయుడు, మీసాల మనోహర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక తహశీల్దార్ వివిఎస్ శర్మకు సోమవారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం సేకరించ కొనుగోలు కేంద్రాల వద్ద సరైన సదుపాయాలు, సంబంధిత అధికారులు లేరని వారు తెలిపారు. దీనివల్ల రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. రైతులు ధాన్యాన్ని ఇతర మండలాలకు తీసుకెళ్లి అమ్మాల్సిన పరిస్థితి వస్తుందని, దీనివల్ల ఎంతో నష్టం వాటిల్లుతుందని వారు ఆవేదన చెందారు. ప్రభుత్వం చెప్పినట్లు ఏ కొనుగోలు కేంద్రం వద్ద కొలతలు జరగడంలేదని, ఈ విషయంపై తహశీల్దార్ స్పందించి దోపిడీకి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన తహశీల్దార్ సమస్యలపై జెసితో చర్చించి అక్రమాలకు పాల్పడిన వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు

'స్పందన' వినతులు పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి -కలెక్టరేట్

స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని కలెక్టరు నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జెసి ఒ.ఆనంద్, ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్ లతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. విభిన్న ప్రతిభావంతులకు కలెక్టరేట్ సెల్లారు హాలులో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్పందన కార్యక్రమంలో కలెక్టరు వారి నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఉచిత ఉపకరణాలు పంపిణీ పథకంలో భాగంగా బొత్స శిరీషకు రూ.15వేలు విలువచేసే స్మార్ట్ ఫోన్, యడ్ల నారాయణకు రూ.7500 విలువచేసే ట్రై సైకిల్, కె. సత్యనారాయణకు రూ.5వేలు విలువ చేసే హియరింగ్ ఎయిడ్స్ పంపిణీ చేశారు. స్పందన కార్యక్రమంలో 105 అర్జీలు ప్రజలు అందజేశారు. వీటిలో కొన్ని...

వీరఘట్టం మండలం, తలవరానికి చెందిన సన్యాసమ్మ తూడి గ్రామంలో ఉన్న భూరికార్డులను మార్చివేశారని, వాటిని సరిచేయించి, రికార్డులను తారుమారు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మక్కువ మండలం శంబరకు చెందిన సెలవలస సావిత్రి తన ఒరిజనల్ సదరన్ సర్టిఫికేట్ బస్సులో పోయినదని, కొత్త సర్టిఫికేట్‌ను మంజూరు చేయాలని కోరారు. పార్వతీపురం మండలం, వెలంపేటకు కోట సరస్వతి, తనకు 1-బి ఇప్పించవలసిందిగా కోరారు. గరుగుబిల్లి మండలం నందివానివలస గ్రామానికి చెందిన రెడ్డి సత్యం నాయుడు తన అరటి పంట తుపానుకు నష్టపోయినందుకు ప్రభుత్వం వారు బీమా మంజూరు చేసినా, ఆ సొమ్ము తన బ్యాంకు ఖాతాలో ఇప్పటి వరకు జమ కాలేదని, తనకు రావాల్సిన సొమ్మును తన ఖాతాలో జమ చేయవలసిందిగా కోరారు. గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్‌పేటకు చెందిన ఆరిక దమయంతి ఈ ఏడాది తనకు రావాల్సిన చేయూత డబ్బులు రాలేదని, ఎందుకు రావడం లేదని గ్రామ సచివాలయంకి వెళ్ళి అడుగగా నువ్వు పోలీస్ స్టేషన్ లో గవర్నమెంట్ స్వీపర్ పనిచేస్తున్నట్లు ఉన్నదని, అందువల్ల తనకు చేయూత రాలేదని చెప్పుతున్నారని, తాను గవర్నమెంట్ స్వీపర్ కాదని కావున నాకు రావాల్సినరాయితీలు వచ్చేలా చూడాలని కోరారు.

ఫిర్యాదుదారుల నుంచి వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్, జెసి

సీతానగరం మండలం సుభద్ర సీతారాంపురం గ్రామానికి నమ్మ అప్పమ్మ తనకు అభయ హస్తం పెన్షన్ అందుతుందని, వికలాంగుల పెన్షన్ రావడంలేదని, తనకు అభయ హస్తం పెన్షనుతో పాటు వికలాంగుల పెన్షన్ కూడా ఇప్పించవలసినదిగా కోరారు. కొమరాడ మండలం, ఉలికిరి పంచాయితీ మాజీ ఎంపిటిసి సభ్యులు బిడ్డిక తమ్మయ్య తమ ప్రాంతంలో రామభద్రపురం ఆర్ అండ్ బి నుండి ఉలికిరి వలస ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల తాకుతూ అల్లువాడ గ్రామానికి పోయే రోడ్డు చాలా అధ్వానంగా ఉందని, దీంతో రాకపోకలకు చాలా కష్టంగా ఉందని, రోడ్డు మంజూరు చేయాలని కోరారు. పార్వతీపురం మండలం కొత్తవలస గ్రామ పరిధిలోని సర్వేనంబరు 196లో 2007-08లో ఇందిరమ్మ గృహకల్ప కార్యక్రమంలో ఇళ్ల పట్టాలు ఇచ్చారని, అయితే ఆర్థిక యిబ్బందుల వల్ల ఇళ్లు కట్టుకొనలేకపోయానని, నెలరోజులలో నిర్మాణాలు మొదలు పెడతామని కావున అనుమతి ఇవ్వవలసినదిగా ఎం .జయమ్మ ఇతరులు కోరారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ జగన్నాధరావు, డిఇఒ ఎస్.వి.రమణ, జిల్లా పశుసంవర్ధక జెడి ఏ. ఈశ్వరరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎం.వి.జి.కృష్ణా, డిఆర్‌డిఎ, డ్వామా, హౌసింగ్ పీడీలు పి.కిరణ్ కుమార్, పి.రఘురాం, కె.రామ చంద్ర రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ఓ. ప్రభాకరరావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు 6090 కొత్త పింఛన్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాకు 6090 కొత్త పింఛన్లు మంజూరైనట్లు కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో స్పందన కార్యక్రమం అనంతరం ప్రాధాన్యత అంశాలపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం లక్షా30,048 పెన్షన్లు అందిస్తున్నామని, కొత్తగా 6090 పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. ప్రస్తుతం పెన్షన్లు పొందుతున్న వారిలో 2450 అనర్హులు ఉన్నారన్న ఆరోపణలు రావడంతో ప్రస్తుతం వారికి నోటీసులు ఇచ్చి విచారణ జరుగుతుందన్నారు. విచారణ అనంతరం అనర్హులను మాత్రమే తొలగిస్తామని, అర్హత ఉన్నవారిని ఎట్టిపరిస్థితుల్లోనూ తొలగించమని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. పెన్షనర్ల విచారణను ఈ నెల 28వ తేదీకల్లా పూర్తిచేయాలన అధికారులను ఆదేశించారు. జిల్లాకు కొత్తగా మంజూరైన 1169 బియ్యం కార్డులను డౌన్లోడు చేసి వెంటనే పంపిణీ కార్యక్రమం పూర్తిచేయాలని, వచ్చేనెల నుంచి వారికి బియ్యం అందించాలని సూచించారు. ఇకపై ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైల్స్ ఇ-ఆఫీసు విధానంలోనే రూపొందించాలని, కలెక్టరు కార్యాలయం నుంచే ఈ విధానాన్ని అమలు చేయడం ప్రారంభించాలని అన్నారు. అసైన్డ్ భూముల వివరాలను పంపించాలని తహశీల్దార్లను ఆదేశించారు. ఓటరు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులపై విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కార్యక్రమంలో జెసి ఒ.ఆనంద్, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యత : జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి-బొబ్బిలి

క్రీడలకు వైసిపి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మున్సిపల్ షటిల్ కోర్టులో రాష్ట్ర స్థాయి షటిల్ టోర్నమెంట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహించేందుకు జగనన్న క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రీడలలో యువత రాణించాలని కోరారు. క్రీడా పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 30 జట్లు హాజరయ్యాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు మురళి పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు రమణారావు

ప్రజాశక్తి-పాలకొండ రూరల్/పాలకొండ

గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలు అమలు చేయాలని, పనిభారాన్ని తగ్గించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు అన్నారు. స్థానిక దక్షిణాముఖ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం గ్రీన్ అంబాసిడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ అంబాసిడర్లకు కనీస వేతనం రూ.20వేలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రూ.10వేలు వేతనాలు అమలు చేస్తామని జిఒ 57 ఇచ్చినప్పటికీ నేటికీ ఆ విధంగా వేతనాలు చెల్లించలేదన్నారు. అతి తక్కువ గౌరవ వేతనాలతో కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని, గౌరవ వేతనం పేరుతో కనీస వేతనం అమలు చేయకుండా, కనీస సౌకర్యాలు కల్పించకుండా తీవ్రంగా దోపిడీ చేస్తున్నారన్నారు. జిఒ 57 కాగితాలకే పరిమితమైందని, ఎక్కడా అమలు కావడం లేదని అన్నారు. ఈ జిఒ కిందిస్థాయి అధికారులకు ఇవ్వకుండా కార్మికులకు మభ్యపెట్టడం దుర్మార్గమైన చర్యన్నారు. గ్రీన్ అంబాసిడర్లుగా పనిచేస్తున్న వారిలో 90శాతం దళితులు, మిగిలిన వాళ్లు కూడా బలహీనవర్గాలకు చెందిన వారని, ఇటువంటి వారికి కనీస వేతనం అమలు చేయకుండా దోపిడీ చేయడం సరికాదని ఆందోళన వ్యక్తం చేశారు. మరోపక్క నెలల తరబడి వేతనాలు బకాయిలు చెల్లించకుండా కార్మికులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తుందని, వీరికి కార్మిక చట్టాలేవి వర్తింపు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో రాజకీయ జోక్యం తీవ్రంగా ఉందని, నాయకులు వీరిని ఇష్టానుసారంగా ఇబ్బందులకు గురిచేస్తూ తొలగిస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఇటువంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, తొలగింపులు, వేధింపులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్‌కు ఇస్తున్న ప్రాధాన్యత, దానికి కారకులైన కార్మికులకు ఇవ్వడం లేదని, సచివాలయాల్లో కార్మికులపై తీవ్రమైన ప్రభావాన్ని మోపుతున్నారని, ఆరోగ్యం బాగోలేకపోయినా కనీసం పట్టించుకునే పరిస్థితి లేదని, సెలవులు కూడా ఇచ్చే పరిస్థితి లేదని అన్నారు. పనికి కావాల్సిన రిక్షాబండి, ఇతర పనిముట్లు లేకపోయినా అందించడం లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే కార్మికులందరికీ జిఒ 57 ప్రకారం కనీస వేతనం రూ.10వేలు అమలు చేయాలని, ఉద్యోగభద్రత కల్పించి పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, కార్మికులకు ప్రభుత్వమే గుర్తింపు కార్డులు, యూనిఫారాలు ఇవ్వాలని, పనిచేస్తున్న కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, దహనసంస్కారాల ఖర్చులకు రూ.15వేలు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు, తొలగింపులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేసి పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ప్రతి నెలా 5లోగా కార్మికులకు వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, బకాయి వేతనాలు వెంటనే చెల్లించి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండల కార్యదర్శి కాద రాము అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండలంలోని అన్ని పంచాయతీల నుంచి గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్లు

వాలంటీర్లే సంధానకర్తలు

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వాలంటీర్లు సంధానకర్తలుగా పనిచేయాలని వైసిపి ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు కోరారు. టిబిఆర్ ఫంక్షన్ హాల్లో సోమవారం వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, వైసిపి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో వైసిపి గెలుపు కోసం ఐక్యంగా పని చేయాలన్నారు. టిడిపి హయాంలో నియమించిన జన్మభూమి కమిటీలు అవినీతికి పాల్పడితే, వైసిపి హయాంలో వాలంటీర్లు రాజకీయాలకు, అవినీతికి అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. బిసిలకు వైసిపి పెద్దపీట వేస్తుందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, నాయకులు తూముల భాస్కరరావు, ఇంటి గోపాలరావు, శంబంగి వేణు, ఎఎంసి చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే బొండపల్లి మండలంలోని గొట్లాంలో వాలంటీర్లు, నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపి బెల్లాన చంద్రశేఖర్‌రావు, ఎమ్మెల్సీలు సురేష్‌బాబు, పి.విక్రాంత్, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, పిఎసిఎస్ అధ్యక్షులు, వైసిపి మండలాధ్యక్షులు పాల్గొన్నారు.



రాంప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న వక్తలు, సాహితీవేత్తలు

తెలుగు భాష గొప్పతనాన్ని చాటి చెప్పాలి

ప్రజాశక్తి - సాలూరు

తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాల్సిన అవసరం వుందని పట్టణ కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు కోరారు. సోమవారం డాక్టర్ బిఎస్ఎన్ మూర్తి పంచమ సారస్వత నీరాజనం కార్యక్రమం లో ఆయన మాట్లాడారు. తొలుత కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బెలగాం భీమేశ్వర రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా జర్జాపు ఈశ్వరరావు మాట్లాడుతూ క్రమేణా తెలుగు భాష వాడకం తగ్గుతోందని చెప్పారు. పరభాషా వ్యామోహంలో పడి మాతృభాషను చిన్నచూపు చూసే పరిస్థితి కనిపిస్తోందని అన్నారు. డాక్టర్ బిఎస్ఎన్ మూర్తి అవార్డు లకు ఎంపికయిన డాక్టర్ వి.గణేశ్వరరావు, డాక్టర్ ఎవి వేణుగోపాల్, రాంప్రసాద్‌ను సన్మానించారు. అనంతరం జాతీయ కథల పోటీలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సాలూరు సాహితీ మిత్ర బృందం వ్యవస్థాపక అధ్యక్షుడు జెబి తిరుమలాచార్యులు రచించిన రచనలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాలూరు సాహితీ మిత్ర బృందం అద్యక్షులు రావాడ కృష్ణకుమారి, కార్యదర్శి గొట్టాపు శ్రీనివాసరావు, సభ్యులు ఎం.గౌరీశంకర్, శేషాద్రి సోమయాజులు,చందూ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మామ,అల్లుడు దుర్మరణం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని చిన గోరా కాలనీ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మామ, అల్లుడు మృతి చెందారు. పోలీసులు, గ్రామస్తులు చెప్పిన వివంలిలా ఉన్నాయి. మండలంలోని కె.ఇచ్చాపురం పంచాయతీ రామాపురానికి చెందిన కూరంగి చిరంజీవి (52), తన మామ ఉయ్యక సత్యం(60) పొలం పనులు ముగించుకుని సోమవారం వనజ గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు చిన ఘోర కాలనీ సమీపంలో ఢీకొట్టింది. దీంతో మామ, అల్లుడికి తీవ్ర గాయాలయ్యాయి.108 వాహనం అందుబాటులో లేకపోవడంతో ఆటోలో వీరఘట్టం పిహెచ్‌సికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చిరంజీవి మృతి చెందాడని, సత్యంను మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్సై హరికృష్ణ తెలిపారు. వీరి మరణంతోగ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. చిరంజీవి భార్య చిన్నమ్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మెరుగైన వైద్య సేవలకు శిక్షణ దోహదం

ప్రజాశక్తి -కలెక్టరేట్

కుటుంబ వైద్య విధానం ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు శిక్షణల ద్వారా అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథ రావు అన్నారు. ఇఎన్‌టీ, కంటి వ్యాధులు, ఓరల్ హెల్త్, మెంటల్ హెల్త్, పాలియేటివ్ కేర్ వంటి సేవలను, విస్తరించిన ప్యాకేజీపై సిహెచ్‌ఒలు, ఎంఎల్‌హెచ్‌పిలకు శిక్షణా కార్యక్రమాన్ని స్థానిక గిరిజన సంక్షేమ భవన్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ ఆరు రోజుల పాటు అయిదు బ్యాచులుగా నిర్వహించనున్నామన్నారు. పిహెచ్‌ఒలు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ శిక్షణ దోహద పడుతుంది అని అన్నారు. అలానే ప్రతి వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ సెంటర్ లో 67 రకాల మందులు 14 రకాల లాబ్ టెస్టులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రజల చెంతకు వైద్యం అందించి ఆరోగ్యకర గ్రామాలుగా రూపొందించేందుకు సమర్థంగా సేవలందించాలని కోరారు. అనంతరం స్టేట్ నోడల్ ఆఫీసర్ డి.భాస్కర రావు ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు.

శిక్షణనుద్దేశించి మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జగన్నాధరావు

రైలు నిలుపుదల చేయాలి

కొమరాడ : గుమడ రైల్వే స్టేషన్ వద్ద ప్యాసింజరు, ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్లాట్‌ఫారం వైపు నిలుపుదల చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గుమడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు ఒక్కొక్క రోజు ఎక్స్‌ప్రెస్, పాసింజర్ రైళ్ల మెయిన్ లైన్‌లో నిలిపివేయడంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. విశాఖ నుంచి రాయగడ వెళ్లే పాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల రెండో నెంబరు ప్లాట్‌ఫారానికి రావాల్సి ఉండగా జంబో ప్యాక్స్ అంటే డబల్ ట్రైన్ గూడ్స్ బళ్ళు రెండో ప్లాట్‌ఫారంలో ఎక్కువ సమయం నిలిపివేయడంతో మెయిన్ లైన్‌లో రైళ్లను నిలిపివేయాల్సి వస్తుందన్నారు. దీనివల్ల వృద్ధులు, వికలాంగులు, చిన్నపిల్లలు ట్రెన్లు దిగేటప్పుడు చాలా ఇబ్బంది పడే పరిస్థితి ఉందని అన్నారు. అలాగే ట్రాక్ దాటే సమయంలో ఏ రైలు వస్తుందో, ఏ ప్రమాదానికి గురవుతామని భయాందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. కావున సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని రెండో నెంబరు ప్లాట్‌ఫారం వద్ద రైళ్లను నిలిపేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పింఛనుదారులను గందరగోళంలో పడేయొద్దు

పార్వతీపురం టౌన్ : పింఛన్దారులను గందరగోళంలో పడవేయవద్దని సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ, పాకల సన్యాసిరావు అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో 174 జిఒ ప్రాప్తికి మీరు అర్హులని రుజువుచేయలేకపోతే పింఛను రద్దుచేస్తామని సుమారు 414 మంది సామాజిక భద్రతా పింఛను లబ్దిదారులకు ప్రభుత్వం వారు ఆన్లైన్లో జనరేట్ చేసి సచివాలయం వాలంటీర్ల ద్వారా ఇచ్చిన నోటీసులు మీ అనుమతితో ఇవ్వడం జరిగిందని అన్నారు. మళ్లీ మీ సంతకాలతో పింఛను రద్దు కాదు పునః పరిశీలన మాత్రమేనని ప్రకటించారని, ప్రభుత్వం ఇచ్చిన నోటీసులకు వివరణ మీరెలా ఇస్తారని ప్రశ్నించారు. అధికారికంగా ఏదైన జీవో ప్రభుత్వం ఇస్తే అది పలు సందేహాలు కలుగుతున్నాయని, ప్రభుత్వం తరపున ఇచ్చిన నోటీసులు వాస్తవమా? మీరు ఇచ్చిన నోటు వాస్తవమా? అన్నదానిపై స్పష్టత ఇవ్వాలని అన్నారు .

కొనసాగుతున్న కందికొత్తల ఉత్సవాలు

గుమ్మలక్ష్మీపురం : ఆదివాసీల తరతరాల పండుగ కందికొత్తల ఉత్సవాలు మూడో రోజు కూడా గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో ఘనంగా నిర్వహించారు. మూల జమ్మూ, ఒప్పంగి గిరిజనులు గుమ్మలక్ష్మీపురం వచ్చి గొడ్డలమ్మను ఇంటింటికి తిప్పి పూజలు అందించారు. ఈ ఉత్సవాల్లో మహిళలు, యువత, గిరిజన వృద్ధులు పాల్గొనడం విశేషం. గిరిజన నృత్యాలు చేస్తూ సాంప్రదాయాన్ని కాపాడాలని లక్ష్యంతోనే ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు.

సూరంపేటలో ఫ్యామిలీ ఫిజీషియన్

రోగులతో మాట్లాడుతున్న జగన్మోహన్‌రావు

సీతానగరం : మండలం లోని సూరంపేటలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహన రావు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైద్యాధికారి, వైస్ సర్పంచ్ సమక్షంలో గ్రామస్తులకు పలు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. వివాహం తద్వారా ఆరోగ్యం పై వాటి ప్రభావం, గర్భిణీల ఆరోగ్య పట్ల వైద్య సిబ్బంది, కుటుంబ సభ్యులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందస్తు జాగ్రత్తగా కోవిడ్‌పై, బూస్టర్ టీకాపై అవగాహన కల్పించారు. అనంతరం కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న రోగి ఇంటికి వెళ్లిపలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌బిఎస్‌కె కో-ఆర్డినేటర్ డాక్టర్ ధవళ భాస్కరరావు, వైద్యాధికారులు ఉషారాణి, వంశీ బాబు, వైస్ సర్పంచ్ సింగిరెడ్డి. ఈశ్వరరావు, సెక్రటరీ ధనలక్ష్మి, వైద్య సిబ్బంది, దుర్గాప్రసాద్, జగదీష్ పాల్గొన్నారు.

దేవాడ బెల్టు మైనింగ్ లీజును రద్దుచేయాలి

సిఐటియు ఆధ్వర్యాన ర్యాలీ

ప్రజాశక్తి-గరివిడి

దేవాడలో బెల్టు మైనింగ్ లీజును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన స్థానిక రైల్వేగేటు నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టివి రమణ మాట్లాడుతూ దేవాడ బెల్టు పరిధిలో గల దువ్వాం, కోడూరు, కొండపాలెం, దేవాడ గ్రామపంచాయతీ చెందిన 225 ఎకరాల్లో 65 లక్షల టన్నుల మాంగనీస్ ఓర్ ఉందని, దీన్ని తవ్వుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ - టెండర్ ద్వారా మహలక్ష్మి మినరల్స్ అనే కంపెనీకి మంజూరు అనుమతిచ్చిందని మండిపడ్డారు. ఇక్కడ ఉన్న ఖనిజాలను తవ్వుకొని ఇతర ప్రాంతాలకు తరలించు పోవడానికి యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఇటీవల జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ సభలో పలు గ్రామాల ప్రజలు వ్యతిరేకించినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇక్కడ మైనింగ్ చేస్తే గ్రామాలన్నీ దుమ్మీ ధూళితో నిండిపోతాయని, ప్రజలు అనారోగ్యం బారిన పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు అడుగంటు పోతాయని, తాగునీరు కూడా నోచుకోనే పరిస్థితులు ఉండవని ప్రజలంతా గగ్గోలు పెట్టినా ప్రభుత్వం ఆ అనుమతులు రద్దు చేయలేదని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి మైనింగ్ లీజును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్దఎత్తున పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు అంబళ్ల గౌరినాయుడు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్‌కు స్పెషల్ డ్రైవ్

పార్వతీపురం టౌన్ : మున్సిపల్ పరిధిలో ఉన్న మూడు సచివాలయాలలో ఈ నెల 17వ తేదీ నుండి 31వ తేదీ వరకు ఆధార్ అప్డేట్‌కు స్పెషల్ డ్రైవ నిర్వహించనున్నామని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. యజేశారు. జగన్నాథపురంలో ఒకటో సచివాలయం, మేథర వీధిలోని 5వ సచివాలయం, కొట్టబెలగాంలోని 8వ సచివాలయాల్లో ఈ సేవలు వినియోగించుకోవాలన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పార్వతీపురంరూరల్ : అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, పింఛన్ల తొలగింపుపై లబ్ధిదారులు భయం ఆందోళన చెందన క్కర్లేదని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. గోచెక్క పంచాయతీ పరిధిలోని లిడికివలస, ఒకసారివానివలసలో సోమవారం గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వ పథకాలు అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. లబ్ధిదారులకు సంబంధించిన వివరాలు ఉన్న కరపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉదయాన శకుంతల, ఎంపీటీసీ వాటిక సత్యవతి, ఎంపిపి శోభారాణి, జెడ్‌పిటిసి రేవతమ్మ, ఎఎంసి ఛైర్మన్ భాగ్యలక్ష్మి , నాయకులు రమేష్, నాగేశ్వరరావు, శేఖర్, బంకపల్లి రామకృష్ణ మడక విశ్వనాథం వాటిక సుందర్రావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఎపిటిఎఫ్ ధర్నా

విజయనగరం టౌన్ : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద సోమవారం ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.ఈశ్వరరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ పిఎఫ్, ఇఎస్ ఐ బకాయిలు చెల్లించాలని, ఎల్‌బిస్, ఎపిజిఎల్‌ఐ రుణాలు మంజూరు చేయాలని, డిఎ బకాయిలు చెల్లించాలని, సిపిఎస్ రద్దు చేయాలని, సిఫార్సు బదిలీలను ఆపాలని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఆ సంఘం నాయకులు ఎ.సదాశివరావు,ఆర్.కృష్ణ, ఎస్‌వి పైడిరాజు, ఎవి శ్రీనివాసరావు, మధుసూదనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంగవీటి సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

వంగవీటి మోహన్ రంగా 34వ వర్ధంతి సోమవారం స్థానిక జీఎస్‌ఆర్ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు గురాన అయ్యలు మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాలకు రంగా చేసిన సేవలు అభినందనీయమని కొనియాడారు. వంగవీటి రంగా మరణించి 34 ఏళ్ళు గడిచినా ఆయనపై ప్రజలు అభిమానం ఏ మాత్రం చెక్కుచెదరలేదని అన్నారు. పేదల కోసం జీవించి , వారితో మమేకమై బతికిన రంగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. ఎమ్మెల్యేగా కొన్నాళ్ళే పని చేసినా పేదల సమస్యలపై ఆయన చేసిన పోరాటం చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో పవన్ కుమార్ , మణికంఠ,మహేష్ ,బాష, రాజేష్ ,అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నదొరకు అంత్యక్రియలు

కురుపాం : స్థానిక శివన్నపేటకు చెందిన అప్పన్నదొర శనివారం ప్రమాదవశాత్తు గొయ్యిలో పడి కాలుకు దెబ్బ తగిలిన విషయం తెలుసుకున్న కళింగ వైశ్య జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు వెంటనే పశు వైద్య అధికారిని తీసుకెళ్ళి గొయ్య నుంచి బయటకి తీసుకొచ్చి వైద్యం చేయించారు. ఒక్కరోజు బతికిన తర్వాత ఆదివారం ఉదయం మృత్యువాత చనిపోయింది. వెంటనే అంధవరపు అప్పన్న కోడ అంత్యక్రియలు జరిపించారు. అనంతరం ఆంజనేయస్వామి గుడి వద్ద అన్నదానం నిర్వహించారు.

పప్పుల చీటీ పేరిట ఘరానా మోసం

● 12,500 మందికి టోకరా ●సుమారు రూ.4.50 కోట్లతో పరారైన నిర్వాహకురాలు ●లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

ప్రజాశక్తి- గుర్ల, నెల్లిమర్ల

పప్పుల చీటీ పేరిట ఘరానా మోసం జరిగింది. 12 నెలలు, నెలకు రూ.300 చొప్పున డబ్బులు కడితే పండగ సమయానికి మీకు పండగకి సరిపడా కిరాణా సరుకులు ఇస్తామంటు నమ్మ బలికిన నిర్వాహకులు వేలాది మంది వద్ద నుంచి డబ్బులు వసూలు చేశారు. తీరా సరుకులు ఇవ్వాల్సిన సమయం వచ్చే సరికి ఆ డబ్బుతో పరారయ్యారు. దీని వెనుక పెద్ద ముఠా ఉన్నట్లు తెలిస్తోంది.

గుర్ల మండలం ఎస్ఎస్ఆర్ పేటలో ఉంటున్న పతివాడ శ్రీలేఖ ఘరాన మోసానికి పాల్పడింది. పప్పులు చీటీల పేరుతో గుర్ల, నెల్లిమర్ల మండలాల్లో 12,500 మంది వద్ద నుంచి సుమారు రూ. 4.50 కోట్లు వసూలు చేసింది. వారందరికీ సంక్రాంతి కానుకగా సరుకులను ఇవ్వాల్సి ఉంది. కానీ ప్రస్తుతం ఆమె గ్రామంలో కనిపించకపోవడం, సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో ఆందోళనకు గురైన బాధితులు పెద్ద ఎత్తున ఆమె ఇంటికి చేరుకుని ఆందోళనకు దిగారు. అనంతరం అక్కడి నుంచి గుర్ల పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఆమెపై ఫిర్యాదు చేశారు.

వాలంటీర్ శ్రీలేఖ ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

వాలంటీర్‌గా విధులు

శ్రీలేఖ నెలిమర్ల మండలం కొండగుంపాం గ్రామ సచివాలయంలో వాలంటీర్‌గా పనిచేస్తుంది. గుర్ల మండలం ఎస్ఎస్ఆర్ పేటలో తన కన్నవారి ఇంట్లో ఉంటూ తొలుత పలువురుతో పప్పుల చీటీలు కట్టించింది. ప్రతి ఒక్కరి నుంచి నెలకు రూ.300 చొప్పున కట్టించుకుంది. ఇలా 12 నెలలు రూ.3600 కడితే సంక్రాంతి పండుగకి సరిపడా సామాన్లు ఇస్తామని నమ్మబలికింది. ఆమె పనిచేస్తున్న సచివాలయం పరిధిలోని కొండగుంపాం, గరికిపేట గ్రామాల్లో కూడా మహిళా వాలంటీర్లతో కలిసి డబ్బులు వసూలు చేసింది. ఇలా ఈ రెండు మండలాల్లో సుమారు 12500 మందిని చేర్చుకుని డబ్బులు వసూలు చేయించింది. విజయనగరం మండలంలోని కొండకరకాం గ్రామానికి చెందిన శ్రీలేఖ బంధువు మజ్జి అప్పలరాజు కూడా ఈ మోసంలో భాగస్వామిగా ఉన్నట్లు తెలిస్తోంది. అతనే ఈ కుంభకోణానికి ప్రధాన సూత్రధారిగా ఉన్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. అప్పలరాజు తన చుట్టూ పలువురు ఏజెంట్లని ఏర్పాటు చేసుకుని మరీ చీటీలు కట్టించి మోసానికి పాల్పిడనట్లు తెలిస్తోంది.

ఎలా బయటపడిందంటే..!

ఈ నెల 25న క్రిస్మస్ పండుగ సందర్భంగా సభ్యులలో పలువురు క్రిస్టియన్లు తమకి సామాన్లు ఇవ్వవలసిందిగా కోరారు. రేపిస్తాను, ఎల్లుండిస్తాను అని శ్రీలేఖ చెప్పడం, రెండు రోజులు తరువాత సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడం, మనిషి కూడా కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన బాధితులు ఇంటికెళ్లి చూసేసరికి తాళం వేసి ఉండటాన్ని గమనించి కంగుతిన్నారు. ఒత్తిడి చేసినా సరుకులు ఇవ్వకుండా అప్పలరాజు అండ్ కో పరారైపోయ్యారని, తాము మోసానికి గురయ్యామని భావించి సభ్యులు ఆందోళనకు దిగారు. శ్రీలేఖ లాంటి వారిని చాలా మందిని అప్పలరాజు ఏర్పాటు చేసుకుని గ్రామాల్లో చీటీల పేరిట డబ్బులు వసూలు చేయించి మోసానికి పాల్పడినట్లు తెలిస్తోంది. వారి చేతిల్లో మోసపోయిన బాధితుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలిస్తోంది. ఈ కుంభకోణంలో అధికార, ప్రతిపక్ష పార్టీల ప్రమేయం కూడా ఉందని బాధితులు ఆరోపించడం కొసమెరుపు..



పప్పుల చీటీ కార్డు ఇదే..

ఊహించని సాయమందిస్తున్నాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వీరఘట్టం

వైసిపి ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు ద్వారా ఊహించని సహాయం ప్రజలకు అందిస్తున్నామని ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి విద్యార్థులకు సూచించారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో 8వ తరగతి విద్యార్థులకు ఆమె ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. మనబడి నాడు- నేడులో భాగంగా పాఠశాలల అభివృద్ధితోపాటు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, జగనన్న విద్యా కానుక, విద్యా దీవెన అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతుందని అన్నారు. అందరూ చక్కగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రత్యేక తలు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపవిద్యా శాఖ అధికారి ఆర్ విజయకుమారి, మండల విద్యాశాఖ అధికారి పద్రి కృష్ణమూర్తి, ఎంపిపి దమలపాటి వెంకటరమణ నాయుడు, జెడ్‌పిటిసి జంపు కన్నతల్లి, ఉమా మహేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షు లు కర్రి గోవింద రావు, ఎంపిడిఒ ఎ. ప్రభాకర్ రావు, మండల ఉపాధ్యక్షులు పి. విజయకుమారి, ఎస్ఐ ఎం. హరికృష్ణ, పిఎసిఎస్ డైరెక్టర్లు ఆంజనేయులు, భోగి మాణిక్య చంద్రశేఖరావు పాల్గొన్నారు.

బామిని: విద్యార్థికి ట్యాబ్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు కోసం రూ.5 లక్షలతో నిర్మించదలచిన బస్సు షెల్టర్‌ను, రూ. 15లక్షలతో నిర్మించనున్న వ్యవసాయ ఉత్పత్తులు కలెక్షన్ సెంటర్‌కు ఎమ్మెల్యే కళావతి భూమి పూజ చేసి శంకుస్థాపన చేసారు. అనంతరం భామిని ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను చూసి వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పార్ట్ టైం టీచర్స్, లెక్చరర్స్ తమ రోజు వారి వేతనాలు పెంచాలని ఆమెకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తోట సింహాచలం, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, స్కూల్ ఛైర్మన్ నిమ్మల కుమారి, సర్పంచులు లోపింటి రాజేష్, తోఘరానా శ్రీను, ఆగతముడి రఘు పతినాయుడు, మజ్జి మోహన్ బాబు, ఎంపిటి సిలు టింగ అన్నాజిరావు, కొత్తకోట చంద్రశేఖర్, బిడ్డికి తులసి, వైసిపి నాయకులు కొవ్వాడ చిరంజీవులు, గెల్లంకి రమేష్, ప్రిన్సిపాల్ రఘు పాత్రుని శివకుమార్, ఉపాధ్యాయులు నిమ్మల మోహన్ రావు, పాఠశాల సిబ్బంది వున్నారు.

కోడూరికి సన్మానం

సాలూరు : పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త డాక్టర్ కోడూరి సాయి శ్రీనివాసరావును సోమవారం విశాఖపట్నానికి చెందిన శ్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. స్థానిక సత్యసాయి సేవా సమితి మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన్ను ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీదేవి సన్మానించారు. పట్టణంలో నిరుపేదలకు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన రోజా భోజనం పంపిణీ చేయడం, ఇటీవల ఓ గిరిజన వృద్ధురాలిని అనాథాశ్రమంలో చేర్పించడంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా సన్మానించారు. కరోనా వైరస్ విజృంభణ సమయంలో ప్రజలంతా ఇళ్లకు పరిమితమైన పరిస్థితుల్లో శ్రీనివాసరావు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేసిన కృషి వెలకట్టలేనిదని శ్రీదేవి కొనియాడారు.

సాయి శ్రీనివాసరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

భూ సమస్య లేని గ్రామాలుండాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతానగరం

భూ సమస్య లేని గ్రామాలు ఉండాలి అన్నదే జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్షా పథకం ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే ఎ.జోగారావు అన్నారు. మండలంలోని వెంకటాపురం పంచాయతీ పరిధిలో గల నీలకంఠాపురంలో 70 మంది రైతులకు సమగ్ర సర్వే చేసిన పాస్ పుస్తకాలను సోమవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూ వివాదాలను పరిష్కరించడమే సమగ్ర సర్వే ప్రధాన లక్ష్యాల్లో ఒకటన్నారు. వందేళ్ల తర్వాత ఈ సర్వే జరుగుతోందని, ఈ సర్వేను మన గ్రామంలో పూర్తిచేయడం ద్వారా మన ప్రాంత ప్రజలకు గొప్ప మేలు జరిగిందని అన్నారు. ఏ ఒక్క రైతు భూ పట్టాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, ఎవరికీ ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా మీ ఇంటి వద్దకే మీ భూమి పత్రాలు అందజేస్తున్నట్టు తెలిపారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చాలా మంది రైతులు తమ భూమి ఆన్లైన్ కాక రైతు భరోసా పథకంతో పాటు ఈ క్రాప్ చేయించుకోలేక పంటను అమ్ముకొనలేక చాలా ఇబ్బందులు పడుతున్నామని తన దృష్టికి తీసుకొచ్చారని, వీటి అన్నింటికి వైఎస్ఆర్ జగన్ శాశ్వత భూహక్కు, భూ పథకం ద్వారా పరిష్కారం చూపుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు మామిడి బాబ్జీ, ఎంపిపి బలగ రమణమ్మ, వైస్ ఎంపిపి టి.సూర్యనారాయణ, తహశీల్దార్ ఎన్‌వి రమణ, వైసిపి మండల పార్టీ నాయకులు బలగ శ్రీరాములు నాయుడు, గ్రామ సర్పంచ్ బుడితి శ్రీనివాసరావు, వైస్-సర్పంచ్ ఆర్.రాము, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

భూ హక్కు పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - సీతంపేట

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు గిరిజనులు స్పందన కార్యక్రమంలో వినతులు సమర్పించారు. సోమవారం స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో పిఒ బి.నవ్య స్పందన కార్యక్రమం నిర్వహించారు. స్వీకరించిన వినతుల్లో... నడిమిక్కెళ్లకు చెందిన మహేష్ రక్షణ గోడ నిర్మించాలని, ధారపాడు చెందిన బెన్నయ్య వాటర్ ట్యాంక్ మంజూరు చేయాలని, జి.గుమ్మడ చెందిన ప్రసాదరావు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. మలేరియా సబ్ యూనిట్ కార్యాలయం ద్వారా స్ప్రేయింగ్ వర్కర్ల వేతనాలు చెల్లించాలని, గుమ్మడకు చెందిన సోములు విన్నవించారు. లోకొండకు చెందిన కృష్ణారావు శ్మశానంవాటికకు సిసి రోడ్డు మంజూరు చేయాలని కోరారు. గడిపాయడు చెందిన రాజు కల్లంమడి చెక్ డ్యామ్ మరమ్మతులు చేయాలని పిఒను కోరారు. మదనాపురానికి చెందిన ప్రభావతి డి-పట్టా మంజూరు చేయాలని, గుమ్మడకు చెందిన కె.నారాయణరావు కార్పెంటర్ పనిముట్లు ఇప్పించాలని తీసుకువెళ్లారు. స్పందన కార్యక్రమంలో సిడిపిఒ రంగలక్ష్మి, ఎపిఒ రోషిరెడ్డి, ఎఇలు వెంకటేష్, నాగభూషణం, పవన్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో పిఒకు వినతులు

అర్జీదారులతో మాట్లాడుతున్న పిఒ నవ్య

సమన్వయంతోనే పంచాయతీ అభివృద్ధి

ప్రజాశక్తి - కురుపాం

గ్రామ సమస్యలను గుర్తించి అందరూ సమన్వయంతో ప్రణాళిక తయారుచేసి ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయడమే గ్రామసభ లక్ష్యమని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. సోమవారం మండలంలో బియ్యాలవలస సచివాలయంలో సర్పంచ్ పి.అజారి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి చెందాలంటే వాలంటీర్లు, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది సమగ్ర ప్రణాళిక తయారు చేసి ప్రణాళిక ఆధారంగా పంచాయతీని అభివృద్ధి పర్చాల న్నారు. అలాంటప్పుడు పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని, ముఖ్యంగా ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వాలంటీర్లే రథసారథులని, కావున వాలంటీర్లంతా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలు ప్రజలకు అందించడంలో జాప్యం వహించకుండా నిర్దేశించి పనులను సక్రమంగా సకాలంలో చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కె.అనురాధ, మాజీ సర్పంచ్ పి.పత్తి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి పద్మావతి

వాలంటీర్లే సంధానకర్తలు

ప్రజాశక్తి-బొండపల్లి

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వాలంటీర్లు సంధానకర్తలుగా పనిచేయాలని వైసిపి ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి సూచించారు. సోమవారం బొండపల్లి మండలం గొట్లాంలో వైసిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అధ్యక్షతన నిర్వహించారు. సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లు, వాలంటీర్ పరిధిలో ఇద్దరు గృహ రథసారథులను త్వరగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాలంటీర్లు ప్రభుత్వం తరుపున పనిచేస్తే, కన్వీనర్లు పార్టీ తరుపున పనిచేయాలని తెలిపారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ చంద్రబాబు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎద్దేవాచేశారు. టిడిపి హయాంలో బిసిలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. సమావేశంలో జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్‌రావు, ఎమ్మెల్సీలు సురేష్‌బాబు, పి.విక్రాంత్, ఎంపిపిలు చల్ల చలంనాయుడు, బెల్లాన జ్ఞానదీపిక, గేదెల సింహాద్రి అప్పలనాయుడు, పీరుబండి హైమావతి, జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశరావు, గార తవుడు, రౌతు రాజేశ్వరి, వర్రి నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : 2024 ఎన్నికల్లో వైసిపి గెలుపు కోసం ఐక్యంగా పని చేయాలని వైసిపి ఉత్తరాంధ్ర పరిశీలకులు వైవి సుబ్బారావు, మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు కోరారు. టిబిఆర్ ఫంక్షన్ హాల్లో సోమవారం వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, వైసిపి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

అన్ని తరగతులూ ఒకే గదిలో..

ప్రజాశక్తి- సీతంపేట

అన్ని తరగతులూ ఒకే గదిలో నిర్వహించడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని మండలంలో పివి ఈతమానుగూడ గ్రామస్తులు అన్నారు. ఆ గ్రామంలో సోమవారం టిడిపి నాయకులు పడాల భూదేవి పర్యటించి గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 80 మంది విద్యార్థులుండగా ఒకే గదిలో అన్ని తరగతులూ నిర్వహిస్తున్నారని దీంతో చదువులు ఇబ్బందిగా సాగుతున్నాయని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. మంచినీరు సమస్య చాలా తీవ్రంగా ఉందని గ్రామస్తులు చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గ్రామ పెద్దలు మండగి గోపాలరావు, పత్తిక కుమార్ (గిరిజన సంఘం), మాజీ సర్పంచ్ పత్తిక యల్లాంగ్, సంఘ పెద్ద పత్తిక తోటన్న, ఊయక భుజంగరావు, పత్తిక గంగన్న, పత్తిక మాసయ్య, పత్తిక ఎనర్త్, సీనియర్ నాయకులు సవర మంగయ్య, యువ నాయకులు భాను చందర్, తేజమ్మ, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులతో చర్చిస్తున్న భూదేవి

'టిడిపి గెలుపునకు కృషి చేస్తా'

గుమ్మలక్ష్మీపురం : 2024 ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించి చూపిస్తామని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చం నాయుడుకు తెలిపినట్లు టిడిపి ఇంచార్జి తోయక జగదీశ్వరి తెలిపారు. విశాఖలోని టిడిపి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఉత్తరాంధ్ర జిల్లాల నియోజకవర్గ ఇన్చార్జిల సమావేశానికి హాజరైనట్లు చెప్పారు. కురుపాం నియోజకవర్గంలో చేపడుతున్న ఇదేం కర్మ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ కష్ట సుఖాలను తెలుసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో మంచి ఆదరణ వస్తుందని ఆయనకు విన్నవించినట్లు తెలిపారు. ఉత్తరాంధ్రలోని 34 నియోజకవర్గ స్థానాల్లో ఎమ్మెల్యేలను గెలిపించి చూపిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. విజయనగరం జిల్లాలో చంద్రబాబు పర్యటన విజయవంతం కావడంతో టిడిపి శ్రేణుల్లో మంచి జోష్ నింపినటు ఆమ్మె తెలిపారు. ఇదే జోష్‌తో ముందుకెళతామన్నారు.

వాహనాలు వేలం

కొమరాడ : నాటు సారాతో పట్టుబడిన వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద సోమవారం వేలంపాట నిర్వహించారు. ఎస్సై జగదీష్ నాయుడు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర ఆధ్వర్యంలో వేలంపాటి నిర్వహించారు. 2021లో నాటు సారా రవాణాతో పట్టుబడిన నాలుగు వాహనాలను వేలం నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. భవిష్యత్తులో జరగనున్న వేలం వివరాలు కూడా ప్రకటన ద్వారా తెలియజేస్తామని సందర్భంగా వారు తెలిపారు.

రబీకి సాగునీరు విడుదల చేయాలి

గుమ్మలక్ష్మీపురం: తోటపల్లి పాత కుడి, ఎడమ కాలువల ద్వారా వేసవి పంటలకు నీటిని విడుదల చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు వినతిని అందజేసినట్లు గరుగుబిల్లి మండలం టిడిపి మండల అధ్యక్షులు అక్కేనా మధుసూదన్ రావు తెలిపారు. ఖరీఫ్ సీజన్ మాదిరిగానే వేసవిలోనూ కూడా రైతులు వరి, వాణిజ్య పంటలు ఎక్కువగా వేస్తుంటారని కలెక్టర్‌కు వివరించినట్లు తెలిపారు. రైతుల సౌకర్యార్థం వేసవి నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ కార్యనిర్వహణాధికారి విజయ్ అంకుశం, నాయకులు గంగాధర్ నాయుడు, కిషోర్ ఉన్నారు.

ట్యాబ్‌లపై అవగాహన

బలిజిపేట : బైజ్యూస్ టాబ్‌ల ఇన్‌స్టాలేషన్‌పై డిప్యూటీ డిఇఒ పి.బ్రహ్మాజీరావు సోమవారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా 8వ తరగతి విద్యార్థులకు అందించే ట్యాబ్‌ల ఇన్‌స్టాలేషన్, వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి

ప్రజాశక్తి - కలెక్టరేట్

కురుపాం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గిరిజన సంఘం నాయకులు మడంగి శ్రీనువాసరావు సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్‌కు వినతిని అందజేశారు. తరగతి గదిలోనే హాస్టల్ నిర్వహిస్తున్నారని, మరుగుదొడ్లు సరిగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, సుమారు 300 మంది విద్యార్థులను నాలుగు గదుల్లో ఇరికించి తరగతులు నిర్వహిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా పార్వతీపురం లోని చాకలి బెలగాంలో నిర్వహిస్తున్న కురుపాం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను విద్యార్థులకు సరిపడే ఇతర భవనాలకు మార్చాల్సిందిగా కోరారు.

పింఛన్లు తొలగించొద్దు

పార్వతీపురంటౌన్ : వృద్ధుల, వికలాంగుల, వితంతువుల పింఛన్లు తొలగించొద్దని జనసేన నాయకులు జిల్లా జాయింట్ కలెక్టర్ ఓ. ఆనందను కోరారు. సోమవారం జనసేన పార్టీ జిల్లా నాయకులు రెడ్డి కరుణ, వి. దాలినాయుడు, రాజాన రాంబాబు, బంటు శిరీష్, మండల శరత్ కుమార్, శిరిపురపు గౌరి శంకర్ తదితరులు జెసిని కలిసి సామాజిక పింఛన్లు అందుకుంటున్న వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తదితర వారికి వాలంటీర్లు ఇచ్చిన నోటీసులపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పింఛన్‌పైనే ఆధారపడి జీవిస్తున్న లబ్ధిదారులు భయాందోళన గురవుతున్నారన్నారు. క్షేత్రస్థాయిలో కొన్ని సాంకేతిక సమస్యలున్నాయన్నారు. రికార్డుల్లో ఉన్న ఇంటిని చూపించి పింఛన్ తొలగిస్తే అటు పిల్లలు చూడక, ఇటు ప్రభుత్వం పింఛన్ ఇవ్వకపోతే బాధితులు ఇబ్బంది పడే ప్రమాదం ఉందని, పింఛన్ మంజూరు చేసినప్పుడే, ఇటువంటివన్ని ముందుగా చూడాలి తప్ప మధ్యలో ఇలా గందరగోళానికి గురి చేయకూడదన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ కేవలం నోటీసు మాత్రమేనని, తొలగింపు కాదని, వివరణ ఇస్తే సరిపోతుందని అన్నారు. సహాయ సహకారాలను వాలంటీర్లు అందిస్తారని, ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేస్తారన్నారు.